క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ ఫర్హత్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ అష్టలక్ష్మీ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ సిరీస్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ కమలానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ చిత్ర లేఅవుట్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ నేతాజీనగర్, విద్యుత్‌నగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. 11కేవీ ఖిల్లా మైసమ్మ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

జనసంచారంలో వంతెన నిర్మించండి



బ్రిడ్జి నిర్మాణానికి తీసిన గుంత

తుక్కుగూడ: శ్రీశైలం జాతీయ రహదారి అభివృద్ధి, ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు నేషనల్ హైవే అథారిటీ రూ.3 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో హైవేపై నడక వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే బ్రిడ్జి నిర్మించే ప్రదేశం మార్కెట్, బస్టాండ్‌కు దూరంగా ఉందని, అక్కడ నిర్మిస్తే ఎవరికి ఉపయోగం ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు. జనసంచారం ప్రదేశంలో నిర్మించాలని కోరుతున్నారు.

ఆకట్టుకుంటున్న గణనాథుడి గోపురం



గణనాథుడి గోపురాన్ని అరుణాచలం నమూనాలో ఏర్పాటు

బడంగ్‌పేట్: వీరాంజనేయ భక్త సమాజం బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేస్తున్న భారీ గణనాథుడి మండపాన్ని ఈ సారి అరుణాచలం నమూనాలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి కావొచ్చాయని భక్త సమాజం అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి తెలిపారు. రంగు రంగుల విద్యుత్ లైట్లను బిగించే పనిలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు.

మట్టి ప్రతిమల పంపిణీ



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఏసీపీ జానకీరెడ్డి

పహాడీషరీఫ్: పర్యావరణానికి హాని చేకూరకుండా మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించాలని మహేశ్వరం ఏసీపీ జానకీరెడ్డి అన్నారు. వైఆర్‌పీ ఫౌండేషన్ చైర్మన్ యెలిశాల రవిప్రసాద్, వైష్ణోయ్ గ్రూప్ చైర్మన్ ఎడ్ల కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో మామిడిపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌రెడ్డితో కలిసి మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎడ్ల వాసుదేవారెడ్డి, ఎడ్ల రఘువీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు యాతం పవన్ కుమార్‌యాదవ్, సుక్క శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యం

నాగోలు: బ్రాహ్మణ విద్యార్థులు పై చదువులు చదువుకున్నప్పటికీ ఉద్యోగ అవకాశాలు లేకుండా చాలా ఇబ్బందులో ఉన్న నిరుద్యోగులకు జాబ్ మేళాలు ఎంతో దోహదపడతాయని మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మునిపల్లె శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాగోలు డివిజన్‌లోని గోటేటి కల్యాణ వేదికలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యమని ఏదో ఒక రంగంలో రాణించేందుకు ప్రయత్నించాలన్నారు. 1500 మంది ఇంటర్వ్యూలో పాల్గొనగా 315 మందికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సురభివాణి దేవి, తెలుగు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ నిత్యానంద్ ఉన్నారు.

మత్తు.. యువత చిత్తు

- పల్లెలకు పాకిన గంజాయి వ్యాపారం
- పారిశ్రామిక, మురికి వాడల్లో వినియోగం
- అడ్డాగా పొదలు, శిథిలావస్థ భవనాలు
- మత్తుకు బానిస కావద్దంటూ.. అధికారుల అవగాహన కార్యక్రమాలు



డ్రగ్స్ వాడొద్దని డీసీపీ సునీతారెడ్డి, ఎక్సైజ్ శాఖ అధికారుల ప్రచారం(ఫైల్)

మహేశ్వరం: పట్టణాలకే పరిమితమైన గంజాయి వ్యాపారం ప్రస్తుతం.. పల్లెలకు పాకింది. దీంతో యువత, విద్యార్థుల జీవితం ప్రశ్నార్థకంగా మారింది. వినియోగం పెరిగి ఆందోళనకు గురిచేస్తోంది. మహేశ్వరం మండలం క్కుగూడ మున్సిపాలిటీలోని గ్రామాలు, తండాల్లోని యువత, విద్యార్థులు గంజాయి, హుక్కా తదితర మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు. ఆరోగ్యాలను పాడు చేసుకొంటున్నారు. పాఠశాల విద్యార్థులతో పాటు ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్న యువత, వివిధ వృత్తి పనులు చేసుకునే వారు దురలవాట్లకు చేరువవుతున్నారు. శివార్లలోని శిథిల భవనాలు, చెట్ల పొదలు, వెంచర్లను అడ్డాగా చేసుకొని మత్తులో జోగుతున్నారు

పాతబస్తీ నుంచి సరఫరా!

మహేశ్వరం మండలం మహేశ్వరం, మన్సాన్‌పల్లి, అమీర్‌పేట్, నాగారం, సిరిగిరిపురం, తుమ్మలూరు, మహేశ్వరం గేటు వద్ద ఉన్న పారిశ్రామిక వాడ, మన్సాన్‌పల్లి సమీపంలో ఉన్న డబుల్‌బెడ్ రూమ్స్ నిర్మాణం వద్ద, తుక్కుగూడ మున్సిపాలిటీలోని రావిర్యాల, తుక్కుగూడ, మంఖాల్, సర్దార్‌నగర్ గ్రామాల్లో సాయంత్రం, రాత్రి సమయాల్లో నగరంలోని పాతబస్తీ నుంచి కొందరు వ్యాపారులు గంజాయిని తెచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం. అంతే కాకుండా ఇక్కడి నుంచి విద్యార్థులు, యువకులు నగరానికి వెళ్లి మత్తు పదార్థాలను తెచ్చుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

రహస్య ప్రాంతాల్లో..

మత్తుకు అలవాటు పడిన యువత.. ఫొటో షూట్‌లు, దావత్‌ల పేరుతో గ్రామ శివార్లకు వెళ్లి గంజాయిని సేవిస్తున్నారు. ఎండు గంజాయిని పొడిగా చేసి సిగరెట్ (పొగ)రూపంలో తీసుకుంటున్నారు. అదే మత్తులో ఘర్షణ పడుతున్నారు. ఇదే విషయం బయటపడడంతో మత్తుకు బానిసైన వారిని గ్రామపెద్దలు, తల్లిదండ్రులు హెచ్చరించినట్లు తెలుస్తోంది.

ఆరు కేసులు..

మండల పరిధి తనిఖీల్లో 5.1 కిలోల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. సరఫరా చేస్తున్నవారిని అదుపులోకి తీసుకున్నారు. ఠాణా పరిధిలో ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదయ్యాయి. గతంలో నగరం నుంచి నుంచి మండలానికి గంజాయిని బైక్‌పై తరలిస్తుండగా వారిని పోలీసులు పట్టుకున్నారు. 3.2 కిలోల గాంజాను స్వాధీనం చేసుకున్నారు. మహేశ్వరం గేటు పారిశ్రామిక వాడ, రాంకీ వద్ద యువకుల నుంచి 800 గ్రాములు పట్టుకున్నారు. మంఖాల్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ వ్యక్తి గంజాయిని విక్రయిస్తుండగా.. అతన్ని పటుకొని, 752 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తుక్కుగూడలో బీహార్‌కు చెందిన ఇద్దరి నుంచి 400 గ్రాములను స్వాధీనం చేసుకున్నారు.



గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తులను పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు(ఫైల్)

కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, చాపకింద నీరులా పాకుతున్న గంజాయి వ్యాపారాన్ని అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. యువత జీవితాన్ని కాపాడాలని కోరుతున్నారు.

విక్రయించినా, వినియోగించినా చర్యలు



యువత మత్తుకు బానిసై భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దు. గంజాయిని అరికట్టడానికి విస్తృత చర్యలు చేపట్టాం. ఎప్పటికప్పుడు ప్రచారం చేస్తున్నాం. వాహనాలను తనిఖీ చేస్తున్నాం. మత్తు పదార్థాలను అమ్మినా, వినియోగించినా చర్యలు తీసుకుంటాం. గాంజాను అమ్మినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వండి. – తిరుపతిరెడ్డి, ఎక్సైజ్ సీఐ, మహేశ్వరం

ఆరోగ్యం పాడు చేసుకోవద్దు



గంజాయి ఆరోగ్యానికి హానికరం. దీనిని తీసుకున్నప్పుడు టెట్రా హైడ్రో కనాబినాల్ (టీహెచ్‌సీ) రక్తంలో కలిసి మెదడుకు చేరుతుంది. దీంతో నిషా(మత్తు) వస్తుంది. అది మూడు గంటలు పనిచేస్తుంది. ఎక్కువ తీసుకుంటే మతిస్థిమితం కోల్పోతారు. చురుకుదనం తగ్గుతుంది. శారీరకంగా, మానసికంగా బలహీనులవుతారు. చెడు మార్గాలకు లోనవుతారు. – డా.అమీర్ సిద్దీఖి, వైద్యాధికారి, ప్రభుత్వాస్పత్రి, మహేశ్వరం

మహేశ్వరం తహసీల్దార్‌గా పి.చిన్నఅప్పలనాయుడు



మహేశ్వరం: మహేశ్వరం మండల తహసీల్దార్‌గా పి.చిన్నఅప్పలనాయుడు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు మహేశ్వరంలో పనిచేసిన తహసీల్దార్ సైదులు నందిగామ మండలానికి బదిలీ అయ్యారు.. ఈ సందర్భంగా తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న భూ సమస్యలను త్వరితగతంగా పరిష్కరిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న కొత్త పట్టాపాస్ పుస్తకాలు, మ్యూటేషన్ సక్సేషన్‌తో పాటు ఇతర భూ సమస్యల పరిష్కారం చేస్తామన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆయన ఇబ్రాహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి(డీఏఓ)గా, షాబాద్, తాండురు, వికారాబాద్ తహసీల్దార్‌గా, జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేశారు.

కొర్వి బాలకృష్ణముదిరాజ్‌కు పీహెచ్‌డీ అవార్డు



పీహెచ్‌డీ అవార్డు అందుకుంటున్న బాలకృష్ణ ముదిరాజ్

కందుకూరు: మండల పరిధిలోని గూడూరుకు చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కొర్వి బాలకృష్ణముదిరాజ్ ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవంలో ఇంగ్లిష్ విభాగంలో పీహెచ్‌డీ డాక్టర్ పట్టా అందుకున్నారు.' ఎన్‌హ్యాన్సింగ్ సాఫ్ట్ స్కిల్స్ త్రూ లిటరేచర్ అమాంగ్ స్టూడెంట్స్ ఆఫ్ ప్రొఫెషనల్ కోర్సెస్ ఇన్ తెలంగాణ:ఏ స్టడీ' అనే అంశంపై ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందని ఈ సందర్భంగా బాలకృష్ణ తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్

మీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీమేరకు మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లెలగూడ దాసరినారాయణరావు కాలనీలో నిర్వహించిన సీఐటీయూ 3వ మహాసభకు చంద్రమోహన్ హాజరై మాట్లాడారు. సెప్టెంబరు 19, 20 తేదీల్లో తుర్కయంజాల్‌లో జరగనున్న సీఐటీయూ 5వ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికుల శ్రమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదని, ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నా పనిభద్రత లేదన్నారు. సభలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్, వింజమూరి నర్సింహ, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు గోరెంకల నర్సింహ, శేఖర్‌యాదవ్, యాదగిరిచారి పాల్గొన్నారు. అనంతరం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్

మీర్‌పేట కార్పొరేషన్ సీఐటీయూ నూతన అధ్యక్షుడిగా దాసరి బాబు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.యాదగిరి, కోశాధికారిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా మస్క భారతమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దోమలపల్లి జగన్, సహాయ కార్యదర్శిగా పంది అంజయ్య, కావలి అంజూర, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కందాడి గిరీష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం శ్రీరామకృష్ణాపురం కాలనీలోని ఐటీడీఈఎస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వారి కోరిక మేరకు కాంగ్రెస్ నాయకులు మధురఉపేందర్ రెడ్డి తన సొంత డబ్బులతో నిర్మాణం చేసిన షెడ్డును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఈఎస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వారు సొసైటీ ప్రాంగణంలో వివిధ కార్యక్రమాల నిర్వహణకు వేదిక ఉన్నా వినియోగించుకునేలా లేదని వేదికకు సమాంతరంగా ఒక షెడ్డునూ నిర్మిస్తే సాంస్కృతిక, సంగీత, ఆధ్యాత్మిక, ప్రసాద వితరణ కార్యక్రమాల కోసం ఉపయోగపడుతుందని తెలుపగా వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని వెంటనే షెడ్డు నిర్మాణం చేయించడం జరిగిందన్నారు, రాబోయే రోజుల్లో కాలనీ సమస్యలు మా దృష్టికి తీసుకొస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు, సన్యాసి రావు, నరహరి రావు, గణేష్ బాబు, ప్రసాద్, భరద్వాజ్, సత్యనారాయణ, శ్రీనివాస్, నారుమంచి, అన్నపూర్ణ, విజయలక్ష్మీ, రాధ, నీలిమ, స్వప్న, అర్చన, సుజాత పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్

మహేశ్వరం: ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో గత ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అమలుకానీ హామీలను ఇచ్చి, ప్రజలను ప్రలోభపెట్టి ఎన్నికల్లో ఓట్లు పొంది దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రజలను మోసం చేసిందన్నారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రం ఎంపీడీఓకు అందజేశారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బస్వ పాపయ్యగౌడ్, ప్రేమ్ రాజ్‌యాదవ్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ కో కన్వీనర్ అనంతయ్యగౌడ్, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు దేశ్యానాయక్, మోహన్‌నాయక్, దళిత మోర్చా నాయకులు మనోహర్, జిల్లా నాయకులు కుండె కుమార్, మాధవచారి, శంకర్, శ్రీనివాస్, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ శైలజకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మద్యంమత్తులో వాహనాలు నడపవద్దు

నాగోలు: మద్యంమత్తులో వాహనాలు నడపరాదని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ రాచపుడి అన్నారు. మద్యంతాగి వాహనాలు పడుపుతూ పోలీసులకు పట్టుబడ్డ 244 మందికి సోమవారం వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. మద్యంతాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే మీ కుటుంబ సభ్యులతో పాటు ఇతరుల కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. మరోసారి పట్టుబడితే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అమరవర్ధన్‌రెడ్డి, అల్లురయ్య, రమేష్, పాల్గొన్నారు.

గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మలక్‌పేట: గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని దళిత గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బట్టు దాసురావు, ప్రధాన కార్యదర్శి కొర్ర చందు లాల్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం సలీంనగర్ శ్రీశ్రీ బంజారాకాలనీ గుడిసెవాసులతో కలిసి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 30 ఏళ్ల నుంచి గుడిసెలు వేసుకొని నివాసముంటున్న పేదలకు ఓటర్, రేషన్, ఆధార్ కార్డులు ఉన్నాయని, మూడు దఫాలు సైదాబాద్ మండల రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారన్నారు. 131 మందిని అర్హులుగా గుర్తించారని 15 సంవత్సరాలుగా ఈ సమస్య పెండింగ్‌లో ఉందని వినతిలో పేర్కొన్నారు.

అభివృద్ధికి చిహ్నాలు కాలనీ ముఖద్వారాలు

ఎమ్మెల్యే సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: అభివృద్ధికి చిహ్నాలు.. కాలనీ ముఖద్వారాలు అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గం సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని పంజాల అనిల్‌కుమార్‌కాలనీ ప్రధాన రహదారిలో విజయదుర్గ సమేత ఉమా మహేశ్వర స్వామి ఆలయ ముఖ ద్వారాన్ని హైకోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తాలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఆలయాలు ప్రశాంతతకు నిలయాలన్నారు. అనంతరం అర్చకులు కుంబాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఇంటూరి విద్యారెడ్డి, అంకిరెడ్డి, బోయిని మహేందర్ యాదవ్, బేర బాల కిషన్, ఆరుట్ల సురేష్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు పెండ్యాల నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంనర్సింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ముఖద్వారం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, న్యాయమూర్తి వెంకటేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్

కందుకూరు: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో గ్రామాల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పులిమామిడిలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.9.50 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. ఆయనకు అందరి తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పానుగంటి రాజుగౌడ్, నాయకులు బుక్క పాండురంగారెడ్డి, మునగాల రమేశ్, బానూరి నరేందర్‌రెడ్డి, గంగవరం మల్లయ్య, పాపగళ్ల రవీందర్, బుక్క మహేందర్‌రెడ్డి, జల పాండురంగాచారి, అనేగొని పాండుగౌడ్, పాపగళ్ల యాదయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేస్తాం

ఏఐసీసీ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో సీసీరోడ్ల పెండింగ్ పనులను సోమవారం ప్రారంభించారు. పనులను అధికారులతో కలిసి ఏఐసీసీ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పనులను తిరిగి పునరుద్ధరణ చేసి అందుకు సహకారం అందించిన కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ చిగురింత పారిజాత, కమిషనర్ సరస్వతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్యాచ్‌వర్క్స్ పనులను కూడా పూర్తి చేయిస్తామన్నారు. రోడ్డు పనులు పూర్తిచేసి ప్రజలకు, కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఏఐసీసీ కోఆర్డినేటర్ రాఘవేందర్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



వైద్యురాలికి వినతిపత్రం అందిస్తున్న ఆశవర్కర్లు, నాయకులు

కందుకూరు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు సోమవారం కందుకూరు పీహెచ్‌సీలో వైద్యురాలికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. నెలకు రూ.18 వేల వేతనంతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు శ్రీలత, జయసుధ, అండాలు, ముంతాజ్ బేగం, అనిత, అఫ్రోజ్, రజిత, మంజుల, మాధవి తదితరులు పాల్గొన్నారు.



రంగు రంగుల ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో గణనాథునికి వెల్‌కమ్ చెబుతున్న ఉత్సవ సమితి సభ్యులు

గణనాథునికి గ్రాండ్ వెల్‌కమ్

మీర్‌పేట: గణేశ్ ఉత్సవ సమితి నెలకొల్పి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా రజతోత్సవ ఉత్సవాలలో భాగంగా మేళ తాళాలు.. బాణాసంచా.. ఫ్లడ్ లైట్ల వెలుగులో గణనాథునికి గ్రాండ్‌గా వెలకమ్ చెప్పారు. జిల్లెలగూడ తిరుమలనగర్ కాలనీలోని హరిహర క్షేత్రం వద్ద గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం గణేష్ నవరాత్రి ఉత్సవాలను కాలనీవాసులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సారి 25వ సంవత్సరం కావడంతో రజతోత్సవ వేడుకల పేరిట ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించాలని ఉత్సవ సమితి ప్రతినిధులు నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి గణనాథుడిని మండపానికి తీసుకొచ్చే ముందు రంగు రంగుల ఫ్లడ్ లైట్లు, డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. అంతేగాకుండా గణేశ్ మండపాన్ని కేదార్‌నాథ్ నమూనాతో నిర్మించినట్లు ఉత్సవ సమితి సభ్యులు, మాజీ కార్పొరేటర్ అనిల్‌యాదవ్ తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఎల్‌బీనగర్: వినాయక ఉత్సవాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ఇబ్బందులు లేకుండా చూడాలని ఎల్‌బీనగర్ సర్కిల్–3 డీసీ వంశీకృష్ణ ఆదేశించారు. సోమవారం ఆయన కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గుంతలుగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయాలని అవసమైన చోట రోడ్లు వేయాలన్నారు. విగ్రహాలు తరలించే దారుల్లో అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, వీధిలైట్లు వెలిగేలా చూసుకోవాలన్నారు. మండపాలు, బేబీపాండ్లు, చెరువుల వద్ద ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని సూచించారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణ, నవజీవన్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు రమేష్‌బాబు, కనకయ్య, టౌన్ ప్లానింగ్ ఏసీపీ విజయలక్ష్మీ, శానిటేషన్ డీఈ నీలిమ, పోలీస్ అధికారులు తొట్ల మహేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వాటర్ వర్క్స్ అధికారులు రాజగోపాల్, ఇరిగేషన్ అధికారి సతీష్, వైద్యాధికారులు శ్రీవాణి, సుకన్యరెడ్డి, సరస్వతి, అమిత ఫైర్‌అధికారి సైదయ్య పాల్గొన్నారు.